సాక్షి జగిత్యాల

మంగళవారం । 31 । అక్టోబర్ । 2023

సీఎం సభాస్థలిని పరిశీలించిన ఎస్పీ

ధర్మపురి: వచ్చేనెల రెండున ధర్మపురికి సీఎం కేసీఆర్ రానున్నందును అందుకు అవసరమైన సభాస్థలి ఏర్పాట్లను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ సోమవారం పరిశీలించారు. ముందుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, అనంతరం హెలీప్యాడ్‌తోపాటు, వీఐపీ పార్కింగ్ స్థలం, సభాస్థలికి వచ్చే పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. వసతులు, ఏర్పాట్లపై అధికారులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించి పోలీస్ బందోబస్తుపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఎస్పీలు వెంకటస్వామి, రవీంద్రకుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావ్, సీఐ రమణామూర్తి, ఎస్సైలు దత్తాత్రి, రామకృష్ణ తదితరులున్నారు.



న్యూస్‌రీల్

ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ



రికార్డులు పరిశీలిస్తున్న శ్రీధర్

పెగడపల్లి: మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి శ్రీధర్ సోమవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, ఓపీ, మందుల నిల్వ, ఇమ్యూనైజేషన్ రిజిస్టర్లను పరిశీలించారు. చిన్నారులు, శిశువులకు షెడ్యూల్ ప్రకారం అవసరమైన టీకాలు వేయాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్యాధికారులు నరేశ్, రమ, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, జయశీల, తార, ఫార్మసిస్టు భాస్కర్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మహిళలు సాధికారత సాధించాలి



మాట్లాడుతున్న అశ్విని

జగిత్యాల: మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించాలని జిల్లా కో–ఆర్డినేటర్ అశ్విని అన్నారు. సోమవారం పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాలను అరికట్టడంలో అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం చేపడుతున్న మహిళసాధికారత, 181 సఖీ సెంటర్, 1098 చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్ గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో హేమశ్రీ, గౌతమి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థిని



దేవిశ్రీవర్షిణి

గొల్లపల్లి: ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి చెస్‌పోటీలకు గొలపల్లి మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థిని గాజంగి దేవిశ్రీవర్షిణి ఎంపికైె నట్లు ప్రిన్సిపల్ ఈరవేని రాజ్‌కుమార్ తెలిపారు. అండర్–14 విభాగంలో జిల్లా తరపున దేవిశ్రీవర్షిణి పాల్గొని ప్రతిభ కనబర్చింది. విద్యార్థినిని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపల్ నగేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజలతో పోలీసులు మమేకం

- అడిషనల్ ఎస్పీ ప్రభాకర్



ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జగిత్యాలక్రైం: పోలీస్ శాఖ ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను పాటిస్తోందని అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ అన్నారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు సోమవారం ఓపెన్‌హౌస్ నిర్వహించారు. ప్రజల భద్రతలో ఎంతోమంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని, అమరుల త్యాగాలను ఎవరూ మరవవద్దని సూచించారు. పోలీసులు వినియోగించే ఆయుధాలు, సాంకేతికపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రజలకు చేరువవుతూ శాంతిభద్రతలను రక్షిస్తున్నామని వివరించారు. నిందితులను సులువుగా గుర్తించేందుకు ఫేస్ రికగ్నేషన్ సిస్టం, పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ డివైజ్ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విని యోగిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థినుల రక్షణకు ఏర్పాటు చేసిన షీటీంలు, భరోసా కేంద్రాలు నిరంతరం పనిచేస్తున్నాయని తెలిపారు. సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అపరిచితులకు ఫోన్ చేస్తే వ్యక్తిగత వివరాలు వెల్లడించవద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే టోల్‌ఫ్రీ నంబరు 1930కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీంరావు, ఆర్‌ఐలు జానివి ఎయా, వేణు, ఐటీ కోర్ సీఐ రఫీక్‌ఖాన్, ఫింగర్‌ప్రింట్ సీఐ వెంకటేశ్వ ర్లు, ఆర్‌ఎస్సైలు కృష్ణ, మనీష్, మారుతి పాల్గొన్నారు.



ప్రజలను మోసం చేయడం కన్నా.. ఎన్నికల్లో ఓడిపోవడం మేలు
– స్టీవెన్‌సన్

మీకు తెలుసా?

అంతర్గాం నుంచి నలుగురు ఎమ్మెల్యేలు

జగిత్యాలరూరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే రాజకీయాలకు జగిత్యాల జిల్లాలోని అంతర్గాం గ్రామం పెట్టింది పేరు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన మాకునూరి ధర్మారావు 1962లో జగిత్యాల ఎమ్మెల్యేగా గెలుపొందారు. అలాగే 1985లో గొడిశెల రాజేశంగౌడ్, ఇదే గ్రామానికి చెందిన సుద్దాల దేవయ్య 1985లో చొప్పదండి ఎమ్మెల్యేగా, 2018లో జగిత్యాల ఎమ్మెల్యేగా మాకునూరి సంజయ్‌కుమార్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు.



మాకునూరి ధర్మారావు



రాజేశంగౌడ్



సుద్దాల దేవయ్య



సంజయ్‌కుమార్

ఓటు.. సత్యాగ్రహం ఈ రెండూ ప్రజల చేతిలో ఉన్న ఆయుధాలు
– మహాత్మ గాంధీ



సమస్యాత్మక కేంద్రాలపై నిఘా..!



- జిల్లాలో 248 కేంద్రాల గుర్తింపు
- గతంతో పోల్చితే పెరిగిన వైనం
- ప్రత్యేక దృష్టి సారిస్తున్న అధికారులు

జగిత్యాల: జిల్లాలో సమస్యాత్మక కేంద్రాలు గతంతో పోల్చితే ఈ సారి పెరిగాయి. జిల్లాలోని మూడు నియోజకవర్గాలు జగిత్యాల, ధర్మపురి, కోరుట్లలో మొత్తం 785పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 248 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. 2018లో జరిగిన ఎన్నికల్లో సంఘటనలను దృష్టిలో ఉంచుకున్న జిల్లా ఎన్నికల అధికారులు ఈ సారి పకడ్బందీ చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. కోరుట్ల నియోజకవర్గంలో 2018లో జరిగిన ఎన్నికల సమయంలో 51 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించగా.. గతంలో చోటుచేసుకున్న సంఘటనలను బట్టి ఈసారి 86పోలింగ్ కేంద్రాలకు పెంచారు. అలాగే జగిత్యాలలో గతంలో 44 సమస్యాత్మకమైనవి ఉండగా.. ఇప్పుడు మార్పు చేయలేదు. ధర్మపురిలో మాత్రం గతంలో 49 ఉండగా.. ఈసారి 67గా గుర్తించారు. చొప్పదండి నియోజకవర్గంలోని మల్యాల, కొడిమ్యాల మండలాల్లోని 14 కేంద్రాలు ఉండగా.. ఈ సారి ఎన్నికల్లో 19గా గుర్తించారు. అలాగే వేములవాడ నియోజకవర్గంలో ఉన్న కథలాపూర్, మేడిపల్లి మండలాల్లో 31 కేంద్రాలు ఉండగా.. ఈసారి 32గా గుర్తించారు.

ప్రత్యేక బందోబస్తు..

సమస్యాత్మక ప్రాంతాల్లో అధికారులు, పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. గతంలో జరిగిన కొన్ని సంఘటనల నేపథ్యంలో ఈసారి ఓటర్లకు ఇబ్బంది కలగకుండా అక్కడ పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కువ శాతం ఈ పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలకు ఆస్కారం ఉండటంతో అధికారులు వీటిని ముందస్తుగానే గుర్తించి పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. పార్టీల మధ్య గొడవలు, గుంపులుగుంపులుగా ఉండటంతో ప్రజలు ఓటు వేసే పరిస్థితి లేక ఆయా బూత్‌లలో తక్కువ ఓటింగ్ శాతం నమోదవుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ పోలింగ్ శాతం పెంచేలా.. ప్రజలు ఓటు వేసేందుకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా గొడవలు జరగకుండా చర్యలు చేపడుతున్నారు. గతంలో కంటే భిన్నంగా చర్యలు తీసుకుంటున్నారు. అక్కడ గొడవలు ఎందుకు జరుగుతున్నాయి..? జరగడానికి కారణమేంటి..? అనే కోణంలో అధికారులు బూత్‌ల వద్ద సమాచారం సేకరిస్తున్నారు. వాటిని అదుపు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. కోరుట్లలో గతంతో పోల్చితే ఈసారి అత్యధికంగా మరో 35 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. జగిత్యాలలో పెద్దగా సమస్య లేదని నిర్ధారించుకున్నారు. ధర్మపురిలో మాత్రం మరో 18కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. చొప్పదండిలో 5 కేంద్రాలు, వేములవాడలో ఒకటి చొప్పున సమస్యాత్మకమైనవిగా గుర్తించి ఇక్కడ ప్రత్యేకంగా సిబ్బందిని నియమించనున్నారు.

జిల్లాలో సమస్యాత్మక కేంద్రాలు ఇలా..

నియోజకవర్గం	2018లో	2023లో
కోరుట్ల	51	86
జగిత్యాల	44	44
ధర్మపురి	49	67
చొప్పదండి	14	19
వేములవాడ	31	32

సంగెంను వణికిస్తున్న డెంగీ



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్



మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

- పెరుగుతున్న జ్వర పీడితులు
- 20 రోజుల్లోనే 20మందికిపైగా..
- ఆసుపత్రులకు పరుగులు

కోరుట్ల రూరల్: కోరుట్ల మండలం సంగెం గ్రామంలో డెంగీ జ్వరాలు పెరుగుతున్నాయి. 20 రోజుల్లో 20 మందికి పైగా డెంగీ జ్వరం సోకి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రక్తకణాలు తగ్గటంతో కోరుట్ల, జగిత్యాల, కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. కొందరికి వారం రోజులైనా రక్తకణాల వృద్ధిలో మార్పులు లేకపోవటంతో దాతల ద్వారా రక్తకణాలు సేకరిస్తున్నారు. దీంతో ఆసుపత్రి బిల్లులు తడిసిమోపెడవుతున్నాయి.

ఒకే ఇంట్లో నలుగురికి డెంగీ..

గ్రామంలోని నేరెళ్ల సత్యనారాయణగౌడ్‌కు చెందిన ఒకే కుటుంబంలో నలుగురికి డెంగీ సోకడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే గ్రామంలో చాలామంది విషజ్వరాల బారిన పడుతున్నారు. టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది.

లోపించిన పరిసరాల పరిశుభ్రత..

గ్రామంలో పరిసరాల పరిశుభ్రత లోపించటం కూడా జ్వరాలకు కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలుచోట్ల డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోవటం, నల్లానీటి లీకులతో గుంతల్లో నీరు నిలిచి దోమలు వ్యాపిస్తున్నాయి. పరిసరాల పరిశుభ్రతపై పర్యవేక్షణ సరిగా లేక పోవటంతో డ్రైనేజీలు, మురుగు గుంతల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లకపోవడం కూడా దోమల వృద్ధికి కారణమవుతోంది.

సాక్షి కథనంతో కదిలిన అధికారులు

సంగెంలో డెంగీ జ్వరాలు శీర్షికన ఈనెల 30న ×సాక్షి×లో ప్రచురితమైన వార్తకు వైద్యాధికారులు స్పందించారు. జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురి రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. 78 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. 10మంది తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నట్లు సిబ్బంది గుర్తించారు. 20మంది నుంచి రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. గ్రామంలో మరో రెండు రోజులపాటు శిబిరం నిర్వహించి మూడుబృందాలతో ఇంటింటా సర్వే చేస్తామని హెల్త్ సూపర్‌వైజర్ జక్కని ధనుంజయ తెలిపారు. కార్యక్రమంలో అయిలాపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి సమీన తపస్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, సర్పంచ్ చెప్యాల నర్సయ్య, ఉపసర్పంచ్ శనిగారపు సాగరిక పాల్గొన్నారు.

ఐదు రోజులుగా జ్వరం



నాలుగైదు రోజుల నుంచి జ్వరం వస్తంది. మందులు వాడుతున్నా. తగ్గతలేదు. సోమవారం గ్రామంలో హెల్త్ క్యాంప్ ఉందని తెలిసి పరీక్ష చేయించుకోవటానికి వచ్చిన. పరీక్ష చేసి మందులిచ్చారు. తగ్గకుంటే రక్త పరీక్ష చేయాలన్నారు.

– పల్లి ప్రకాశ్ గౌడ్

రూ.1.18 లక్షల బిల్లయ్యింది



15 రోజుల క్రితం జ్వరమొస్తే మందులు వాడిన. రక్త పరీక్ష చేయించుకున్న. రక్తకణాలు బాగా తగ్గాయి. జగిత్యాలలోని ఓ ఆసుపత్రిలో చేరాను. వైద్యులు డెంగీ జ్వరం అన్నారు. రక్తకణాల్లో వృద్ధి కనిపించలేదు. రక్త కణాలు ఎక్కించారు. ఆసుపత్రి బిల్లు రూ.1.18 లక్షలు అయింది.

– సుదవేణి మహేశ్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇళ్లలో నీరు నిల్వలేకుండా చూడాలి. కూలర్లు, టైర్లు, కొబ్బరి చిప్పల్లో నీటిని తొలగించాలి. జ్వరం వచ్చిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి మందులు తీసుకోవాలి. రెండు, మూడు రోజులైనా తగ్గకుంటే రక్త పరీక్షలు చేయించుకోవాలి. జ్వరం ఉన్నపుడు పేయిన్ కిల్లర్, స్టెరాయిడ్ మందులు వాడకూడదు.

– శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

పోలింగ్ సిబ్బంది జంబ్లింగ్

- జిల్లాలో 2,316 మందికి శిక్షణ
- రిజర్వ్‌లో 20 శాతం సిబ్బంది
- నామినేషన్ల తరువాత ప్రక్రియ

కోరుట్ల: ఎన్నికల్లో పనిచేసే పోలింగ్ సిబ్బందిని జంబ్లింగ్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. జిల్లాలోని వివిధ శాఖల్లో.. వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పోలింగ్ ఏర్పాట్లు, ఎన్నికల అధికారుల విధులు, బాధ్యతలపై శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఇది మంగళవారంతో ముగియనుంది. శిక్షణ పొందిన ఉద్యోగులకు వారు పనిచేసే నియోజకవర్గాలే కాకుండా ఇతర సెగ్మెంట్లలోనూ విధులు కేటాయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

జిల్లాలోనే జంబ్లింగ్..

జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాల్లో విధులు నిర్వహించేందుకు జగిత్యాల సెగ్మెంట్‌కు చెందిన 963 మంది, ధర్మపురిలో 504 మంది, కోరుట్లలో 849 మందికి శిక్షణ ఇస్తున్నారు. పోలింగ్ బూత్‌ల నిర్వహణ, పీవో, ఏపీవో విధులు, ఇబ్బంది లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు, ఓటు నమోదు, ఇతరత్రా అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పొందిన అనంతరం మూడు సెగ్మెంట్లలోని ఉద్యోగుల వివరాలను జిల్లా ఎన్నికల అధికారి పరిధిలోకి తెస్తారు. ఆ తరువాత స్థానికత లేకుండా సిబ్బందిని మూడు సెగ్మెంట్లలో జంబ్లింగ్ చేస్తారు. అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం నియోజకవర్గాలు మార్చుతూ విధులు కేటాయిస్తారు.



కోరుట్లలో శిక్షణ ఇస్తున్న సిబ్బంది

అదనంగా 20 శాతం..

జగిత్యాల నియోజకవర్గంలో 254 పోలింగ్ కేంద్రాలు, కోరుట్లలో 262, ధర్మపురిలో 269 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో పోలింగ్ కేంద్రానికి పీవో, ఏపీవో, ఇద్దరు అసిస్టెంట్లు కలిసి నలుగురు సిబ్బంది ఉంటారు. వీరికి అదనంగా మరో 20శాతం సిబ్బందిని రిజర్వ్ కింద అందుబాటులో ఉంచుతారు. ప్రస్తుతం జిల్లాలో శిక్షణ పొందిన ఉద్యోగుల సంఖ్య 2,319 మాత్రమే ఉండగా రిజర్వ్ సిబ్బందిని కలుపుకొంటే మరో 600 నుంచి 800 మంది ఉద్యోగులు పోలింగ్‌కు అవసరం అవుతారు. ఈ లోటు పూరించడానికి అవసరమైతే అదనంగా సిబ్బంది ఉన్న జిల్లాల నుంచి ఇక్కడికి తరలించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి వేతనాలు పొందుతున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని అదనపు సిబ్బందిగా నియమించే అవకాశాలు కూడా ఉన్నట్లు తెలిసింది.

పీవో, ఏపీవోల ప్రాత కీలకం

ధర్మపురి: ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దివాకర అన్నారు. ధర్మపురిలోని గిరిజన వసతి గృహంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల అధికారులకు సోమవారం ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ తరగతులను దివాకర సందర్శించారు. ఎన్నికల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు చల్ల జనార్దన్, చెరుకు రాజన్న, కాశెట్టి రమేశ్, వెంకటరమణ, భోగ శివప్రసాద్, మల్లేశం, రవీందర్, తహసీల్దార్లు, ఎంపీవోలు, పీవోలు, ఏపీవోలు తదితరులున్నారు.

కొండగట్టులో అంతర్గత బదిలీలెప్పుడో..?

- పదేళ్లుగా ఒకే సెక్షన్‌లో ఉద్యోగి విధులు
- బదిలీలు చేపడితేనే పాలనలో మార్పులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న స్వామి ఆలయంలో ఏళ్లుగా అంతర్గత బదిలీలు లేవు. దీంతో పాలన గాడి తప్పడంతోపాటు కొందరు ఉద్యోగులపై పనిభారం పెరుగుతోంది. ఈ క్రమంలో ఆలయ అభివృద్ధి, ఆదాయం దృష్ట్యా బదిలీల అంశం తెరపైకి వస్తోంది.

ఏళ్లనుంచి ఉద్యోగులు ఇలా..

ఆలయ ఇన్‌స్పెక్టర్ నాలుగేళ్లుగా కొనసాగుతున్నారు. అలాగే టికెట్లు ఇచ్చే ఉద్యోగి ఏడాదిగా విధులు నిర్వర్తిస్తున్నారు. లడ్డూ, ప్రసాదాల తయారీలో ఓ ఉద్యోగి నాలుగేళ్లు, నిత్యాన్నదానం, టెండర్ల నిర్వహణ సిబ్బంది ఒకరు ఏడేళ్లుగా, మూడేళ్లుగా అకౌంట్స్ అధికారి, వాహన పూజల్లో మూడేళ్లు, లడ్డూ కౌంటర్‌లో టికెట్లు ఇచ్చే వ్యక్తి పదేళ్లు, శానిటేషన్ అధికారి మూడేళ్లు, ఆలయ సూపరింటెండెంట్ రెండేళ్లుగా పాతుకుపోయారు. వీరిపై ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినా ఉన్నతాధికారుల్లో చలనం మాత్రం రావడం లేదు. ఒకే అధికారి ఒకే సెక్షన్‌లో ఏళ్లతరబడి ఉండడం.. రెండు, మూడు సెక్షన్లు ఒకే అధికారికి అప్పగించడం ద్వారా పనిభారం పెరుగుతోందని, తద్వారా ఒత్తిడికి లోనవుతున్నారని సమాచారం. కొందరు ఉద్యోగులు వారివారి విభాగాల్లో నిబంధనలు ఉల్లంఘించి అదనపు ఖర్చు చేస్తున్నట్లు ఈవోకు ఫిర్యాదు చేశారు. ఆలయ పాలన మెరుగుపడాలంటే ఈవో స్పందించి అంతర్గత బదిలీలు చేపట్టాలన్న డిమాండ్ వినిపిస్తోంది. ఈ విషయమై ఈవో వెంకటేశ్‌ను వివరణ కోరగా.. ఉద్యోగులు ఏయే సెక్షన్‌లో ఎన్ని రోజుల నుంచి ఉన్నారనేది పరిగణనలోకి తీసుకుని త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.



జిల్లాలో 400 ధాన్యం కొనుగోలు కేంద్రాలు



జేసీ లత

జగిత్యాల: వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లాలో సుమారు 400 కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, రైతులు తేమ శాతం వచ్చాకే కేంద్రాలకు తేవాలని అదనపు కలెక్టర్ లత తెలిపారు. సోమవారం ధాన్యం కొనుగోళ్లపై రా, బాయిల్డ్ రైస్‌మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురాగానే ఇన్‌చార్జిలు టోకెన్లు జారీ చేయాలన్నారు. రైతులకు ముందుగానే నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. రైస్‌మిల్లర్లు కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన వరిధాన్యం ఎఫ్ఏ క్యూ ప్రకారం ఉన్నదా..? లేదా..? అని పరిశీలించి త్వరితగతిన కోతలు లేకుండా దిగుమతి చేసుకోవాలని, ఎలాంటి కోతలు విధించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మొదటిసారిగా ఈ సీజన్‌లో వరిధాన్యం కొనుగోలు ప్రక్రియలో సులభంగా నివేదికలు పొందేందుకు అప్లికేషన్ రూపొందించామని, సదరు అప్లికేషన్‌పై రైస్‌మిల్లర్లకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

‘సీ విజిల్’పై అవగాహన కల్పించాలి

- సీనియర్ డెప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేశ్‌వ్యాస్



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

జగిత్యాల: అసెంబ్లీ ఎన్నికలకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, సీ విజిల్ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సీనియర్ డెప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేశ్‌వ్యాస్ అన్నారు. సోమవారం ఢిల్లీ నుంచి కలెక్టర్లతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నామినేషన్లకు ఏర్పాట్లు చేయాలని, పోటీ చేసే అభ్యర్థులకు ఓటరు జాబితా అందించాలని, స్వతంత్రులకు గుర్తులు కేటాయించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. రెండో ర్యాండమైజేషన్ చేపట్టాలని, అభ్యర్థులు ఎక్కువగా ఉంటే సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ చేయాలని ఆదేశించారు. ఓటర్లకు స్లిప్‌లు అందించాలని, స్ట్రాంగ్‌రూమ్స్, రిసెప్షన్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని, పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ యాస్మిన్ బాషా

- కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. సీ విజిల్‌పై పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించి యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా చూడాలని పేర్కొన్నారు. రూ.50వేల కన్నా ఎక్కువ నగదు తీసుకెళ్లొద్దన్న విషయాన్ని చెప్పాలన్నారు. సర్వీస్ ఓటర్లు ఎన్నికల విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు, పోస్టల్ బ్యాలెట్ కోసం అర్హత గల వారు నిర్ణీత ఫారం 12లో వివరాలు సమర్పించేలా ఏర్పాట్లు చేపట్టాలని నోడల్ అధికారులను ఆదేశించారు. దివ్యాంగులకు నిర్ణీత ఫారం–12డీలో పూర్తి వివరాలతో అధికారులకు సమర్పించాలన్నారు. ఎన్నికల అధికారుల అనుమతి లేకుండా ప్రచార వాహనాలు, కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు పంపిణీ చేసినట్లు తెలిసిందని, అట్టి వాటికి మీడియా సర్టిఫికేషన్ కమిటీ నుంచి ముందస్తు అనుమతి పొందాలని ఆదేశించారు. మద్యం అక్రమంగా రవాణా అవుతున్నట్లు, అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం ఉందని, ఎక్సైజ్ అధికారులు కఠిన చర్యలు చేపట్టాలన్నారు. బెల్టుషాపులు పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, అదనపు కలెక్టర్లు లత, దివాకర, ఆర్డీవోలు రాజేశ్వర్, నర్సింహామూర్తి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాన్నా.. హాస్పిటల్‌కు పోదాం

- విషజ్వరంతో చిన్నారి మృతి
- కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు



రోదిస్తున్న కుటుంబసభ్యులు



సమన్వి (ఫైల్)

ధర్మపురి: నాన్నా.. ఎట్లనో అయితంది.. హాస్పిటల్‌కు పోదాం.. అంటూ విష జ్వరంతో బాధ పడిన ఓ చిన్నారి మృతిచెందింది. పాప మాటలను గుర్తు చేసుకుంటూ త ల్లిదండ్రు లు కన్నీరుమున్నీరుగా విలపించారు. వివ రాల్లోకి వెళ్తే.. ధర్మపురికి చెందిన కొత్తకొండ రాజు–లక్ష్మి దంపతులకు ఇద్దరు కూతుళ్లు. రా జు స్థానికంగా ఓ రెడీమేడ్ షాపు నిర్వహిస్తుండ గా.. తమ పిల్లలను అల్లారుముద్దుగా పెంచు కుంటున్నారు. మూడో తరగతి చదువుతున్న పెద్ద పాప సమన్వి(8)కి వారం రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానిక ఆస్పత్రిలో చికిత్స చే యించారు. న యం కాకపోవడంతో జగిత్యాల తరలించగా వై ద్యులు విష జ్వరంగా తేల్చారు. చికిత్స తర్వా త కొంత నయం కావడంతో రెం డు రోజుల క్రితం డిశ్చార్జి చేయడంతో ఇంటికి తీసుకువచ్చారు. ఆదివారం అర్ధరాత్రి మళ్లీ జ్వరం రావడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబసభ్యులు వెంటనే జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విష మించడంతో కరీంనగర్ తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మనస్వి సోమవారం సాయంత్రం మృతి చెందింది.

యువకుడి ఆత్మహత్య

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని అరవింద్‌నగ ర్‌కు చెందిన ద్యావనపల్లి మహేశ్(27) ఆత్మ హత్య చేసుకున్నాడు. జగిత్యాల పట్టణ ఏఎస్సై వేణురావు వివరాల ప్రకారం.. మహేశ్ ప్రభు త్వ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. అతనికి కొన్నే ళ్లుగా మానసిక స్థితి సరిగా ఉండటం లేదు. ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయ ంలో ఉరేసుకున్నాడు. మృతుని తల్లి నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

రూ.1.74 లక్షలు పట్టివేత

రాయికల్(జగిత్యాల): మండలంలోని బోర్నప ల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు రూ.84,500, రూ.89,800 తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ అజయ్ తెలిపారు. సం బంధిత పత్రాలు చూపకపోవడంతో గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.

పెగడపల్లిలో మద్యం..

పెగడపల్లి(ధర్మపురి): అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సోమవారం పెగడపల్లిలో పట్టుకు న్నట్లు కరీంనగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నరేంద ర్‌రెడ్డి తెలిపారు. గొల్లపల్లి మండలంలోని లక్ష్మీ పూర్‌కు చెందిన తిరుపతి, పెగడపల్లి మండ లంలోని అడుపపల్లికి చెందిన రాకేశ్ పెగడపల్లి నుంచి బైక్‌లపై మద్యం తరలిస్తూ పట్టుబడ్డా రని పేర్కొన్నారు. రూ.19 వేలు విలువైన మ ద్యం బాటిళ్లను, బైక్‌లను స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్వతంత్రుల కార్మిక క్షేత్రం



- నాలుగు దశాబ్దాలు.. 14సార్లు ఎన్నికలు
- గెలుపోటములను ప్రభావితం చేస్తున్న కార్మికులు

గోదావరిఖని: పునర్విభజనకు ముందు మేడారం (ఎస్సీ) నుంచి పునర్విభజన తర్వాత రామగుండం (జనరల్) అసెంబ్లీ నుంచి బరిలో దిగిన స్వతంత్ర అభ్యర్థులకూ నియోజకవర్గ ఓటర్లు పట్టం కడుతూ వస్తున్నారు. మేడారం నుంచి ఎం.రామ్‌గోపాల్ రెడ్డి, మాలెం మల్లేశం స్వతంత్రులుగా బరిలో దిగి విజయం సాధించారు. పునర్విభజన తర్వాత రామ గుండం నుంచి ప్రధాన పార్టీలతో పోటీపడిన సోమారపు సత్యనారయణను కూడా ఓటర్లు తమ అక్కున చేరుకున్నారు. ఇక గతఎన్నికల్లో రామగుం డం అసెంబ్లీ నుంచి ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి కోరుకంటి చందర్ విజయం సాధించారు. సమీప బీఆర్ఎస్ అభ్యర్థి సోమారపు సత్యనారాయ ణపై 26,332 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్ మూడోస్థా నంలో నిలిచారు.



కోరుకంటి చందర్



కొప్పుల ఈశ్వర్



సత్యనారాయణ



మాలెం మల్లేశం



మాతంగి నర్సయ్య

మేడారం నుంచి రామగుండం దాకా..

- రామగుండం పారిశ్రామిక ప్రాంతం గతంలో మేడారం(ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గంలో ఉం డేది.
- నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా రామగుండం కార్పొరేషన్‌తోపాటు పాలకుర్తి, అంతర్గాం, రామగుండం మండలాలను కలుపు కుని 2009లో రామగుండం(జనరల్) 23వ అసెంబ్లీ నియోజకవర్గంగా ఆవిర్భవించింది.
- గోదావరిఖని కార్మిక క్షేత్రమే ప్రధాన కేంద్రంగా ఏర్పడింది.
- రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలా ల్లోని 266 గ్రామాలు, రామగుండం కార్పొరేషన్ లోని 50 డివిజన్లు అసెంబ్లీ పరిధిలోకి వచ్చాయి.
- సింగరేణి, ఎన్టీపీసీ, ఏపీ జెన్‌కో, కేశోరామ్ సిమెంట్, ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమలు ఇక్కడి ప్రత్యేకత.
- సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, వారికుటుంబాల ప్రభావం అభ్యర్థుల గెలుపో టములపై తీవ్రప్రభావం చూపుతున్నాయి.
- నియోజకవర్గంలో ప్రస్తుతం 2,14,974మంది ఓటర్లు ఉన్నారు.
- వీరిలో సుమారు లక్ష వరకు కార్మికులు, వారి కుటుంబాలుంటాయి.
- 2009లో ఇండిపెండెంట్‌గా, 2014లో బీఆర్ఎస్ నుంచి సోమారపు సత్యనారాయణ ఎమ్మెల్యేగా రెండుసార్లు విజయం సాధించారు.

ఈసారి చందర్ వర్సెస్ ఠాకూర్..

కోరుకంటి చందర్ 2018లో ఇండిపెండెంట్‌గా సిం హం గుర్తుపై పోటీచేసి విజయం సాధించారు. టీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే సోమారపు సత్య నారాయణ ఓటమి పాలయ్యారు. ఈసారి నవం బర్‌లో జరిగే ఎన్నికల్లో ప్రధానంగా బీఆర్ఎస్ నుం చి కోరుకంటి చందర్, కాంగ్రెస్ నుంచి ఎంఎస్ రాజ్ ఠాకూర్ మధ్య పోటీ ఉండే అవకాశం ఉంది. బీజేపీ నుంచి కందుల సంధ్యారాణి, ఇండిపెండెంట్‌గా సోమారపు సత్యనారాయణ బరిలో నిలవను న్నారు.

నాలుగు దశాబ్దాల తర్వాత జనరల్..

- 1957లో జనరల్‌గా ఉన్న మేడారం నియోజకవ ర్గంలో పీడీఎఫ్ తరఫున జి.లక్ష్మారెడ్డి, 1962లో స్వతంత్ర అభ్యర్థిగా ఎం.రాంగోపాల్‌రెడ్డి విజయం సాధించారు.
- 1967లో ఎస్సీకి కేటాయించారు.
- ఆనాడు గడిపెల్లి రాములు(కాంగ్రెస్) విజయం సాధించగా, 1972, 1978లో జి.ఈశ్వర్(కాంగ్రె స్) ఎన్నికయ్యారు.
- ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన తర్వాత 1983లో జరిగిన ఎన్నికల్లో మాతంగి నర్సయ్య(టీడీపీ) కాంగ్రెస్ కంచుకోటకు బీటలు కొట్టి గెలుపొం దారు.
- ఇదే సమయంలోనే నాదెండ్ల భాస్కర్‌రావు మం త్రివర్గంలో నెలపాటు మంత్రిగా పనిచేశారు.
- అయితే 1985లో ఆయనకు టికెట్ ఇవ్వకుండా సింగరేణి కార్మికుడు మాలెం మల్లేశం(టీడీపీ)కు టికెట్ ఇవ్వగా మల్లేశం ఘనవిజయం సాధిం చారు.
- 1989లో కాంగ్రెస్ నుంచి మాతంగి నర్సయ్య, 1994లో స్వతంత్ర అభ్యర్థిగా మాలెం మల్లేశం, 1999లో టీడీపీ నుంచి మాతంగి నర్సయ్య గెలుపొందారు.
- బీఆర్ఎస్ ఆవిర్భవించాక 2004లో జరిగిన ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్ ఆ పార్టీ తరఫున పోటీచేసి విజయం సాధించారు.
- నియోజకవర్గాల పునర్విభజనలో 42 ఏళ్ల తర్వాత మేడారం(ఎస్సీ)ని తొలగించి రామ గుండం నియోజక వర్గం(జనరల్)గా మార్పుచేశారు.
- దీంతో అంతకు ముందు మున్సిపల్ చైర్మన్ గా పనిచేసిన సోమారపు సత్య నారాయణ రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

నాలుగుసార్లు స్వతంత్రులకే పట్టం..

నియోజకవర్గంలో కార్మికులు, వారి కుటుంబాల ఓట్లే అత్యధికంగా ఉన్నాయి. వీరి ఓట్లే అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేస్తున్నాయి. మేడారం నియోజకవర్గంలో 11సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. నాలుగుసార్లు కాంగ్రెస్, మూడు సార్లు టీడీపీ, ఒకసారి పీడీఎఫ్, ఒకసారి టీఆర్ఎస్, మూడుసార్లు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. 2009లో రామగుండం అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కూడా స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన సోమారపు సత్యనారాయణను ఎన్నుకుని ఓటర్లు విలక్షణ తీర్పు ఇచ్చారు. 2018లో జరిగిన ఎన్నికల్లో సింహం గుర్తుపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన కోరుకంటి చందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించారు. గెలిచిన తర్వాత చందర్ అప్పటి టీఆర్ఎస్‌లో చేరారు.

మేడారం(ఎస్సీ) అసెంబ్లీ

పదవీకాలం	ఎమ్మెల్యే	పార్టీ
1957–62	జి.లక్ష్మారెడ్డి	పీడీఎఫ్
1962–67	ఎం.రాంగోపాల్‌రెడ్డి	స్వతంత్ర
1967–72	నడిపెల్లి రాములు	కాంగ్రెస్
1972–78	జి.ఈశ్వర్	కాంగ్రెస్
1978–83	జి.ఈశ్వర్	కాంగ్రెస్
1983–85	మాతంగి నర్సయ్య	టీడీపీ
1985–89	మాలెం మల్లేశం	టీడీపీ
1989–94	మాతంగి నర్సయ్య	కాంగ్రెస్
1994–99	మాలెం మల్లేశం	స్వతంత్ర
1999–2004	మాతంగి నర్సయ్య	టీడీపీ
2004–09	కొప్పుల ఈశ్వర్	టీఆర్ఎస్

రామగుండం అసెంబ్లీ (జనరల్)

పదవీకాలం	ఎమ్మెల్యే	పార్టీ
2009–2014	సోమారపు సత్యనారాయణ	స్వతంత్ర
2014–2018	సోమారపు సత్యనారాయణ	టీఆర్ఎస్
2018–2023	కోరుకంటి చందర్	ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్

రామగుండం సమాచారం

జనాభా	2,93,085
ఓటర్లు	2,14,974
పురుషులు	1,08,233
మహిళలు	1,06,716
థర్డ్‌జెండర్	25

పదేళ్లలో ధర్మపురి ఎంతో అభివృద్ధి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఈశ్వర్

వెల్గటూర్(ధర్మపురి): ధర్మపురి నియోజకవర్గ అభి వృద్ధి కోసం తనను మరోసారి ఆశీర్వదించాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. వెల్గటూర్ మండ లంలోని జగదేవుపేటకు చెందిన 100 మంది గ్రామ స్తులు సోమవారం కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సంద ర్భంగా ఆయన వారికి కండువాలు కప్పి, ఆహ్వానిం చారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధర్మపురి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందింద న్నారు. సిరిసిల్ల, సిద్దిపేట తర్వాత రాష్ట్రంలో అత్యం త అభివృద్ధి చెందిన నియోజకవర్గం ధర్మపురి మాత్రమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పే బూటకపు మాటలు నమ్మవద్దని కోరారు.

అభివృద్ధికి పట్టం కట్టాలి

బుగ్గారం: రాబోయే ఎన్నికల్లో అభివృద్ధికి పట్టం కట్టాలని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా బుగ్గారం మండల కేంద్రంలో సోమవారం బీఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వందలాది మంది బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి మాట్లా డుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకు లు బూటకపు వాగ్దానాలతో ఓట్ల కోసం వస్తున్నా రని, ప్రజలు గమనించాలన్నారు. ఎంపీ వెంకటేశ్ నేత మాట్లాడుతూ.. మంత్రిగా ఉండి కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేసిన కొప్పుల ఈశ్వ ర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ బాదినేని రాజమణి, జెడ్పీటీసీ సభ్యుడు రాజేందర్, వైస్ ఎంపీపీ సుచేందర్, సర్పంచ్ మూల సుమలత, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు గాలిపెల్లి మహేశ్ తదితరులున్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

ధర్మపురి: అన్ని వర్గాల సంక్షేమమనే బీఆర్ఎస్ ధ్యేయమని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మ పురి పట్టణంలోని ఓ గార్డెన్‌లో సోమవారం బీడీ టేక దార్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. 70 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో చేసిందే మీ లేదని ఆరోపించారు. ఆ పార్టీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. తుమ్మెనాల గ్రామం నుంచి వంద మందికి పైగా బీఆర్ఎస్‌లో చేరగా, కండువాలు కప్పారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌ప ర్సన్ సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ సభ్యు రాలు అరుణ, ఏఎంసీ చైర్మన్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపుల అండ మరువలేనిది



ఎమ్మెల్యే సంజయ్‌ని సన్మానిస్తున్న నాయకులు

జగిత్యాల: మున్నూరుకాపుల అండ మరువలే నిదని, వారిని అన్ని రంగాల్లో ముందుంచామని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. జగిత్యాలలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత ఆధ్వర్యంలో సోమవారం మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ.. 2014లో రాజకీయా ల్లోకి వచ్చినప్పుడు మున్నూరుకాపులే తనవెంట ఉండి నడిపించారని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు, 24 గంటల కరెంట్ పథకాల ద్వారా ఎక్కువగా మున్నూరుకాపులే లబ్ధి పొందు తున్నారని తెలిపారు.

ప్రతి ఇంటికీ సంక్షేమమే ధ్యేయం

ప్రతి ఇంటికీ సంక్షేమమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. సోమవారం జగిత్యాలలోని 38, 45వ వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ప్రజల సం తోషాన్ని కోరుకునే ఎమ్మెల్యే సంజయ్‌ను మరోసారి గెలిపించాలని ఆయన సతీమణి రాధిక కోరారు. జెడ్పీచైర్‌పర్సన్ వసంత, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

జగిత్యాలరూరల్: పొలాస గ్రామానికి చెందిన 50 మంది మైనారిటీ కాంగ్రెస్ నాయకులు సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే సం జయ్ కండువాలు కప్పి, ఆహ్వానించారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించండి

సారంగాపూర్(జగిత్యాల): బీఆర్ఎస్ ప్రభుత్వ సం క్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే సంజయ్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత కోరారు. సోమవారం సాయంత్రం సారం గాపూర్ మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్త లతో సమావేశమై మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, ఎంపీపీ జమున, జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీల మాయమాటలు నమ్మొద్దు

రాయికల్(జగిత్యాల): సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సంజయ్ కోరారు. సోమవారం రాయికల్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ రమణ, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీల మాయమాటలు నమ్మొద్దని ప్రజలను కోరారు. వివిధ గ్రామాలకు చెందిన 200 మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీపీ సంధ్యారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు జాదవ్ అశ్విని, పట్టణ అధ్యక్షుడు ఇంతియాజ్ తదితరులున్నారు.



అభివృద్ధిలో రాష్ట్రం దేశానికే ఆదర్శం



బీఆర్ఎస్‌లో చేరినవారితో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, సంజయ్

మల్లాపూర్(కోరుట్ల): అభివృ ద్ధిలో మన రాష్ట్రం దేశానికే ఆద ర్శమని బీఆర్ఎస్ జిల్లా అధ్య క్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మల్లాపూర్ మండలంలోని రేగుంట కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు దండికే బుచ్చిరాము లు, పలువురు సోమవారం బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌కుమా ర్‌తో కలిసి కండువాలు కప్పారు. ఈ ఎన్నికల్లో తన కుమారుడిని గెలిపించాలని కోరారు. జాగృతి యువత జిల్లా అధ్యక్షుడు గనవేణి మల్లేశ్, సర్పంచ్ నర్సయ్య, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు సురకంటి తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

అభివృద్ధి, పథకాలే గెలిపిస్తాయి..

కోరుట్ల రూరల్: నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి, సం క్షేమ పథకాలే పార్టీ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌ను గెలిపిస్తాయని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. కల్లూర్ గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు సోమవారం బీఆర్ఎస్‌లో చేరగా కండువాలు కప్పి, ఆహ్వానించారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, ఎంపీపీ తోట నారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సర్పంచ్ వనతడుపుల అం జయ్య, ఎంపీటీసీ సభ్యురాలు చిట్నేని లత, నాయకులు పాల్గొన్నారు.

'గత ప్రభుత్వాలు చేసిందేమీ లేదు'

మెట్‌పల్లిరూరల్: అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే తన కుమా రుడు సంజయ్‌ను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కోరారు. సోమ వారం మెట్‌పల్లి మండలంలోని మేడిపల్లి, రాజేశ్వర్‌రావుపేట, చెర్లకొండాపూర్, సత్తక్కపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. గత ప్రభుత్వాలు చేసిందేమీ లేదని విమర్శించారు. అనంతరం మెట్‌పల్లి మండల బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని, పలు విషయాలపై దిశానిర్దేశం చేశారు. ఎంపీపీ సాయి రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యు లు, నాయకులు పాల్గొన్నారు.

హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం



ఓటు అభ్యర్థిస్తున్న లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి(ధర్మపురి): గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయ డంలో బీఆర్ఎస్ విఫలమైందని ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపిం చారు. పెగడపల్లి మండలంలోని అయితిపల్లి, నందగిరి, నామా పూర్, మ్యాకవెంకయ్యపల్లి, నర్సింహునిపేట, ఏడుమోటలపల్లి, కీచులాటపల్లి, రాజరాంపల్లి, ఎల్లాపూర్ గ్రామాల్లో సోమవారం పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ ధర్మపురిలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. గత ఎన్నికల్లో అప్పటి కలెక్టర్ శరత్ పూణ్యమూని ఓట్ల లెక్కింపులో అవకతవకలకు పాల్పడి, అడ్డదారిన ఎమ్మెల్యేగా గెలిచారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారం లోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. నాలుగు పర్యాయాలు ఓడిపోయిన తనను ఒకసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని విన్నవిం చారు. నాయకులు మల్లారెడ్డి, రామ్‌రెడ్డి, రాజు, గంగాధర్, అశోక్‌రెడ్డి, సత్య నారాయణరెడ్డి, మల్లేశం, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు వ్యతిరేక పవనాలు



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న నర్సింగరావు

కోరుట్ల: రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు వ్యతిరేక పవ నాలు వీస్తున్నాయని కాంగ్రెస్ అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు అన్నారు. సోమవారం కోరుట్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ కుటుంబం నుంచి తెలంగాణ విముక్తి అయ్యే సమయం ఆసన్నమైందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలు ప్రజలను ఆకట్టుకుంటు న్నాయని, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సీఎం కావడం ఖాయమని తెలిపారు. నాయకులు పార్టీ పట్టణ, మండల శాఖల అధ్యక్షులు తిరు మల గంగాధర్, కొంతం రాజం, నాయకులు నయీం, లింబాద్రి, లింగం, శ్రీనివాస్, బుచ్చన్న, లక్ష్మతి తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రావడం ఖాయం

మెట్‌పల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రావడం ఖాయమని కాంగ్రెస్ కోరుట్ల అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు అన్నారు. సోమవారం మెట్‌పల్లి పట్టణానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి, ఆహ్వానించారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేసిందేమీ లేదని విమర్శించారు.

బీఎస్పీ జగిత్యాల అభ్యర్థిగా బల్కం మల్లేశ్‌యాదవ్



జగిత్యాలటౌన్: బీఎస్పీ జగిత్యాల అభ్యర్థిగా బల్కం మల్లేశ్‌యాదవ్ పేరును ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్ర వీణ్‌కుమార్ ఖరారు చేసినట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల లింబాద్రి తెలిపారు. బీఎస్పీతోనే సామాజిక న్యాయం సాధ్యమవు తుందని, బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉంటుందన్నారు.

నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



కాంగ్రెస్‌లో చేరినవారితో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్(జగిత్యాల): నిరుపేదల సంక్షేమమే కాం గ్రెస్ ధ్యేయమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయికల్ మండలంలోని కట్కాపూర్, రామాజీపేట గ్రామాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు 200 మంది కాంగ్రెస్‌లో చేరారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రావు, నాయకులున్నారు.

ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి..

జగిత్యాలటౌన్: ఆరు గ్యారెంటీలతో అధికా రంలోకి వస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. సోమవా రం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి జగి త్యాల పట్టణంలోని 24, 39వ వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు వజ్రమ్మ, సాయి, గోపాల్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

కాంగ్రెస్‌లో చేరిక

పెగడపల్లి మండలంలోని రాములపల్లెకు చెందిన వైఎస్సార్‌టీపీ ధర్మపురి నియోజకవర్గ మహిళా కో–ఆర్డినేటర్ బర్ల మమత కాంగ్రెస్‌లో చేరారు. జగిత్యాలలోని ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆమెకు కండువా కప్పి, ఆహ్వానించారు.

ఏం అభివృద్ధి చేశారో చూపించండి

ధర్మపురి: కాంగ్రెస్ ఆరు పథకాలే పార్టీ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను గెలిపిస్తాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. నేరెల్లలో భజరంగదళ్‌కు చెం దిన 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏం అభివృద్ధి చేశారో చూపిం చాలని డిమాండ్ చేశారు. నాయకులు దినేశ్, బాలాగౌడ్, రమేశ్ తదితరులున్నారు.

'రాష్ట్రాన్ని దోచుకుంటున్న కేటీఆర్, కవిత'



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): రాష్ట్రాన్ని మంత్రి కేటీ ఆర్, ఎమ్మెల్సీ కవిత బకాసురులుగా దోచుకుంటు న్నారని బీజేపీ కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ధర్మ పురి అర్వింద్ ఆరోపించారు. యామపూర్‌లో బీజేపీ బూత్‌స్థాయి సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీ ఇస్తే కేసీఆర్ మాత్రం ధాన్యాన్ని తరుగు పేరుతో దోచు కుంటున్నారని ఆరోపించారు. ఇటీవల గాయపడిన ప్రైవేటు విద్యుత్ హెల్పర్ నూనె శ్రీధర్‌ను పరామ ర్శించారు. ముందుగా యామాపూర్, ఫకీర్‌కొండా పూర్ వరకు నిలిచిపోయిన రోడ్డు పనులను పరిశీ లించారు. పలువురు పార్టీలో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మోర పెల్లి సత్యనారాయణరావు, పార్లమెంటరీ జాయిం ట్ కన్వీనర్ సదాశివ్, అసెంబ్లీ కన్వీనర్ సుఖేందర్ గౌడ్, జేఎన్ వెంకట్, నాయకులున్నారు.

బీఆర్ఎస్ వైఫల్యాలను వివరించాలి

మెట్‌పల్లిరూరల్: బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని అర్వింద్ అన్నారు. మెట్‌పల్లి మండ లం జగ్గసాగర్‌లో మెట్‌పల్లి మండల బూత్‌స్థాయి అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలతో సమావేశమ య్యారు. చౌలమద్ది శివారులో అసంపూర్తిగా వదిలే సిన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించారు. అక్కడ సెల్ఫీ దిగారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజ్‌పాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.




సబలెంకా శుభారంభం

మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో గత ఏడాది రన్నరప్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్) శుభారంభం చేసింది. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి లీగ్ మ్యాచ్‌లో సబలెంకా 6–0, 6–1తో మరియా సాకరి (గ్రీస్)పై గెలిచింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ఆరు ఏస్‌లు సంధించి, తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. మరో లీగ్ మ్యాచ్‌లో జెస్సికా పెగూలా (అమెరికా) 7–5, 6–2తో రిబాకినా (కజకిస్తాన్)పై విజయం సాధించింది.

అర్జున్‌కు మూడో గెలుపు

గ్రాండ్ స్విస్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో విజయం నమోదు చేశాడు. యూకేలోని ఐల్ ఆఫ్ మ్యాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ఐదో రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ 68 ఎత్తుల్లో రినాత్ జుమాబయేవ్ (కజకిస్తాన్)పై గెలుపొందాడు. ఐదో రౌండ్ తర్వాత అర్జున్ నాలుగు పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి ఉమ్మడిగా టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.





ఫారూఖీ

అఫ్గాన్ తీన్‌మార్...

- శ్రీలంకపై ఏడు వికెట్లతో సంచలన విజయం
- ఒకే టోర్నీలో మూడు ప్రపంచ చాంపియన్ జట్లను ఓడించిన హష్మతుల్లా బృందం
- బంతితో మెరిసిన ఫారూఖీ
- రహ్మత్ షా, హష్మతుల్లా, అజ్మతుల్లా అర్ధ సెంచరీలు

ఇకపై తమ జట్టును కూనగా పరిగణించాల్సిన అవసరం లేదని అఫ్గానిస్తాన్ చాటి చెప్పింది. మేటి జట్లపై తాము సాధిస్తున్న విజయాలు గాలివాటమేమీ కాదని తమ నిలకడైన ప్రదర్శనతో నిరూపించింది. మూడోసారి వన్డే ప్రపంచకప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఈసారి తమకంటే అన్ని విభాగాల్లో ఎంతో మెరుగైన జట్లను బోల్తా కొట్టిస్తూ ఔరా అనిపించింది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను కంగుతినిపించిన ఉత్సాహంతో 1992 విశ్వవిజేత పాకిస్తాన్ జట్టును కూడా మట్టికరిపించిన అఫ్గానిస్తాన్ జట్టు తాజాగా 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంకను ఓడించి అందర్నీ ఆశ్చర్యపరిచింది.



అజ్మతుల్లా



రహ్మత్ షా



హష్మతుల్లా

పుణే: ప్రత్యర్థి జట్టు గత రికార్డు ఎలా ఉంటేనేమి తమదైన రోజున సమష్టిగా గర్జిస్తే అద్భుత ఫలితం సాధించవచ్చని వన్డే ప్రపంచకప్ టోర్నీలో అఫ్గానిస్తాన్ జట్టు మూడోసారి నిరూపించింది. భారీ అంచనాలు పెట్టుకోకుండా ఈ మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ మూడో సంచలన విజయంతో అలరించింది. 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంక జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో హష్మతుల్లా షాహిది నాయకత్వంలోని అఫ్గానిస్తాన్ జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలిచి అబ్బురపరిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (60 బంతుల్లో 49; 5 ఫోర్లు), కెప్టెన్ కుశాల్ మెండిస్ (50 బంతుల్లో 39; 3 ఫోర్లు), సమరవిక్రమ (40 బంతుల్లో 36; 3 ఫోర్లు), తీక్షణ (31 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫజల్‌హక్ ఫారూఖీ (4/34) శ్రీలంక జట్టును దెబ్బ తీశాడు. ఒకదశలో 134/2తో పటిష్టస్థితిలో కనిపించిన శ్రీలంక నిసాంక అవుటయ్యాక తడబడింది. 107 పరుగుల తేడాలో ఏడు వికెట్లు కోల్పోయింది. కెరీర్‌లో 100వ వన్డే ఆడిన రషీద్ ఖాన్ ఒక వికెట్ తీయగా, మరో స్పిన్నర్ ముజీబ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం 242 పరుగుల విజయ లక్ష్యాన్ని అఫ్గానిస్తాన్ 45.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ గుర్బాజ్ (0) డకౌట్‌కాగా... రహ్మత్ షా (74 బంతుల్లో 62; 7 ఫోర్లు), హష్మతుల్లా షాహిది (74 బంతుల్లో 58 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (63 బంతుల్లో 73 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో అఫ్గానిస్తాన్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. హష్మతుల్లా, అజ్మతుల్లా నాలుగో వికెట్‌కు అజేయంగా 111 పరుగులు జోడించడం విశేషం.

ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడిపోయిన అఫ్గానిస్తాన్... రెండో మ్యాచ్‌లో 69 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను ఓడించి బోణీ కొట్టింది. మూడో మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో 149 పరుగుల తేడాతో ఓడిపోయి... నాలుగో మ్యాచ్‌లో విజృంభించి 1992 విశ్వవిజేత పాకిస్తాన్‌పై ఏకంగా 8 వికెట్ల తేడాతో గెలిచింది. అనంతరం అదే ఉత్సాహంతో శ్రీలంకను కూడా మట్టికరిపించి అఫ్గానిస్తాన్ పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. మూడోసారి వన్డే వరల్డ్‌కప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఒకే ప్రపంచకప్‌లో మూడు విజయాలు సాధించడం ఇదే ప్రథమం. 2015 ప్రపంచకప్‌లో ఒక మ్యాచ్‌లో నెగ్గిన అఫ్గానిస్తాన్... 2019 ప్రపంచ కప్‌లో ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. ఈ ప్రపంచకప్‌లో మాత్రం అఫ్గానిస్తాన్ తమ కంటే మెరుగైన జట్లకు చెమటలు పట్టిస్తోంది. ఈ టోర్నీలో అఫ్గానిస్తాన్ మిగిలిన మూడు మ్యాచ్‌లను నెదర్లాండ్స్ (నవంబర్ 3న), ఆస్ట్రేలియా (నవంబర్ 7న), దక్షిణాఫ్రికా (నవంబర్ 10న) జట్లతో ఆడుతుంది.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) గుర్బాజ్ (బి) అజ్మతుల్లా 46; దిముత్ కరుణరత్నే (ఎల్బీడబ్ల్యూ) (బి) ఫారూఖీ 15; కుశాల్ మెండిస్ (సి) నజీబుల్లా (సబ్) (బి) ముజీబ్ 39; సమరవిక్రమ (ఎల్బీడబ్ల్యూ) (బి) ముజీబ్ 36; అసలంక (సి) రషీద్ ఖాన్ (బి) ఫారూఖీ 22; ధనంజయ డిసిల్వా (బి) రషీద్ ఖాన్ 14; ఏంజెలో మాథ్యూస్ (సి) నబీ (బి) ఫారూఖీ 23; చమీర (రనౌట్) 1; తీక్షణ (బి) ఫారూఖీ 29; కసున్ రజిత (రనౌట్) 5; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 241.** వికెట్ల పతనం: 1–22, 2–84, 3–134, 4–139, 5–167, 6–180, 7–185, 8–230, 9–239, 10–241. బౌలింగ్: ముజీబ్ ఉర్ రెహ్మాన్ 10–0–38–2, ఫజల్లఖ్ ఫారూఖీ 10–1–34–4, నవీన్ ఉల్ హక్ 6.3–0–47–0, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 7–0–37–1, రషీద్ ఖాన్ 10–0–50–1, నబీ 6–0–33–0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: రహ్మానుల్లా గుర్బాజ్ (బి) మదుషంక 0; ఇబ్రహీమ్ జద్రాన్ (సి) కరుణరత్నే (బి) మదుషంక 39; రహ్మత్ షా (సి) కరుణరత్నే (బి) రజిత 62; హష్మతుల్లా షాహిది (నాటౌట్) 58; అజ్మతుల్లా (నాటౌట్) 73; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (45.2 ఓవర్లలో మూడు వికెట్లకు) 242.** వికెట్ల పతనం: 1–0, 2–73, 3–131. బౌలింగ్: మదుషంక 9–0–48–2, రజిత 10–0–48–1, మాథ్యూస్ 3–0–18–0, చమీర 9.2–0–51–0, తీక్షణ 10–0–55–0, ధనంజయ డిసిల్వా 4–0–21–0.

ప్రపంచకప్‌లో నేడు

పాకిస్తాన్ × బంగ్లాదేశ్
వేదిక: కోల్‌కతా
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	6	6	0	12	1.405
దక్షిణాఫ్రికా	6	5	1	10	2.032
న్యూజిలాండ్	6	4	2	8	1.232
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
అఫ్గానిస్తాన్	6	3	3	6	-0.718
శ్రీలంక	6	2	4	4	-0.275
పాకిస్తాన్	6	2	4	4	-0.387
నెదర్లాండ్స్	6	2	4	4	-1.277
బంగ్లాదేశ్	6	1	5	2	-1.338
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

అనీశ్ డబుల్ ధమాకా

కాంస్య పతకంతోపాటు పారిస్ ఒలింపిక్ బెర్త్ సొంతం



చాంగ్వాన్ (దక్షిణ కొరియా): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల పతకాల వేట కొనసాగుతోంది. సోమవారం జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత యువ షూటర్ అనీశ్ భన్వాలా కాంస్య పతకం సాధించాడు. ఆరుగురి మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 21 ఏళ్ల అనీశ్ 28 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంతో ముగించాడు. ఈ ప్రదర్శనతో అనీశ్ వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను కూడా ఖరారు చేసుకున్నాడు. ఇప్పటి వరకు షూటింగ్‌లో భారత్‌కు 12 ఒలింపిక్ బెర్త్‌లు లభించాయి. మరోవైపు పురుషుల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో హైదరాబాద్ షూటర్ కైనన్ షెనాయ్, జొరావర్ సింగ్ సంధూ, పృథ్వీరాజ్ తొండైమన్‌లతో కూడిన భారత జట్టుకు రజత పతకం దక్కింది. కైనన్, జొరావర్, పృథ్వీరాజ్ బృందం 341 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటి వరకు ఈ టోర్నీలో భారత్ 30 పతకాలు సాధించింది.

వెర్‌స్టాపెన్ రికార్డు

ఈ సీజన్‌లో 16వ విజయం



మెక్సికో సిటీ: ఇప్పటికే ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకున్నప్పటికీ... రెడ్ బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ మాత్రం ఫార్ములావన్–2023 సీజన్‌లో ఎదురులేకుండా దూసుకుపోతున్నాడు. మెక్సికో గ్రాండ్‌ప్రి రేసులో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును మూడో స్థానం నుంచి ప్రారంభించిన వెర్‌స్టాపెన్ తొలి మలుపు వద్ద ప్రత్యర్థి డ్రైవర్లను ఓవర్‌టేక్ చేసి ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత రేసు చివరిదాకా ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. వెర్‌స్టాపెన్ 71 ల్యాప్‌లను అందరికంటే వేగంగా 2 గంటల 2 నిమిషాల 30.814 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలిచాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది 16వ గెలుపు కావడం విశేషం. తద్వారా ఒకే ఏడాది అత్యధిక ఎఫ్1 రేసుల్లో గెలిచిన డ్రైవర్‌గా తన పేరిటే ఉన్న రికార్డును వెర్‌స్టాపెన్ బద్దలు కొట్టాడు. గత ఏడాది వెర్‌స్టాపెన్ 15 రేసుల్లో గెలుపొందాడు. ఓవరాల్‌గా వెర్‌స్టాపెన్ కెరీర్‌లో ఇది 51వ విజయం. ఈ క్రమంలో కెరీర్‌లో అత్యధిక ఎఫ్1 విజయాలు సాధించిన డ్రైవర్ల జాబితాలో నాలుగో స్థానంలో ఉన్న అలైన్ ప్రాస్ట్ (ఫ్రాన్స్) సరసన నిలిచాడు.

లెక్క సరిచేసిన భారత్



రాంచీ: ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు వరుసగా మూడో విజయంతో 'హ్యాట్రిక్' సాధించింది. చైనా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2–1 గోల్స్ తేడాతో నెగ్గింది. భారత్ తరఫున దీపిక (15వ ని.లో), సలీమా టెటె (26వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. చైనా జట్టుకు జాంగ్ జియాకి (41వ ని.లో) ఒక గోల్ అందించింది. ఈ గెలుపుతో ఇటీవల హాంగ్జౌ ఆసియా క్రీడల్లో చైనా జట్టు చేతిలో సెమీఫైనల్లో ఎదురైన ఓటమికి భారత్ బదులు తీర్చుకుంది.

జ్యోతి యర్రాజీకి స్వర్ణం



పనాజీ: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు మూడో స్వర్ణ పతకం లభించింది. సోమవారం జరిగిన అథ్లెటిక్స్ ఈవెంట్‌లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి యర్రాజీ చాంపియన్‌గా అవతరించింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి 13.22 సెకన్లలో అందరికంటే వేగంగా ఫైనల్ రేసును ముగించి అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు తెలంగాణ ఖాతాలో 11వ పతకం చేరింది. మహిళల స్విమ్మింగ్ 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో వ్రితి అగర్వాల్ రజత పతకం సాధించింది.

సినిమా

కౌంట్ డౌన్ స్టార్ట్



● వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా, బేబీ సారా, జయప్రకాశ్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న 'సైంధవ్' జనవరి 13న సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. కాగా ఇది వెంకటేశ్ కెరీర్‌లో 75వ చిత్రం కావడం విశేషం. తాజాగా 'సైంధవ్' విడుదలకు కౌంట్ డౌన్ స్టార్ట్ చేస్తూ మేకర్స్ ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ''పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న చిత్రం 'సైంధవ్'. సినిమా విడుదలకు ఇంకా 75 రోజులు ఉంది. సంతోష్ నారాయణన్ ఈ చిత్రం కోసం అద్భుతమైన ఆల్బమ్ సిద్ధం చేశారు. త్వరలో మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేయబోతున్నాం'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి సహనిర్మాత: కిశోర్ తాళ్లూరు, కెమెరా: యస్. మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం (వెంకట్).

అమ్మాడీ...



● మృణాల్ ఠాకూర్, నాని

మాట రూపంలో కాకుండా ఇంకాస్త ఎక్కువగా ప్రేమను వ్యక్తపరచాలనుకున్నప్పుడు హీరో హీరోయిన్ పాట పాడుకోవడం చూస్తుంటాం. మృణాల్ ఠాకూర్‌పై నాని అలాంటి ప్రేమనే వ్యక్తపరిచారు. ప్రేమను వ్యక్తపరుస్తూ 'అమ్మాడీ...' అంటూ ఆమెను ఉద్దేశించి పాడారు నాని. 'హాయ్ నాన్న' చిత్రంలోని ఈ పాటను నవంబర్ 4న రిలీజ్ చేయనున్నారు. నాని, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'హాయ్ నాన్న'. నాని కుమార్తెగా బేబీ కియారా ఖన్నా నటించింది. ఈ చిత్రం కోసం హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన పాటల్లో తొలి పాట 'సమయమా..', రెండో పాట 'గాజు బొమ్మ..'ను ఇప్పటికే రిలీజ్ చేశారు. 'అమ్మాడీ...' మూడో పాట. నాని, మృణాల్ మధ్య సాగే రొమాంటిక్ సాంగ్ ఇది అని యూనిట్ పేర్కొంది. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డా. విజయేందర్ రెడ్డి తీగల ఈ చిత్రాన్ని నిర్మించారు. డిసెంబర్ 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్ ఐఎస్‌సీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సతీష్ ఈవీవీ.

మమ్మల్ని సినిమా కలిపింది - విజయ్ దేవరకొండ



● బ్రహ్మానందం, విజయ్ దేవరకొండ, తరుణ్ భాస్కర్, సాయికృష్ణ

''నేను, దర్శకులు నాగ్ అశ్విన్, తరుణ్ భాస్కర్, సందీప్ రెడ్డి వంగా వేర్వేరు చోట్ల పెరిగాం. మా నేపథ్యాలు వేరు.. మమ్మల్ని సినిమా కలిపింది. 'పెళ్ళి చూపులు'తో నన్ను హీరోగా పరిచయం చేశాడు తరుణ్ భాస్కర్. ఆ తర్వాత 'ఈ నగరానికి ఏమైంది'తో కొందరు కొత్తవాళ్లకు కెరీర్ ఇచ్చాడు. ఇప్పుడు 'కీడా కోలా'లోనూ ప్రతిభ ఉన్న కొత్తవాళ్లు కనిపిస్తున్నారు. తరుణ్‌కి తనపై, తన కథలపై చాలా నమ్మకం. ఈ విషయంలో అతన్ని గౌరవిస్తాను. ఇండస్ట్రీకి దొరికిన అదృష్టం తను'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కీడా కోలా'. రానా సమర్పణలో కె. వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ దేవరకొండ మాట్లాడుతూ–''తరుణ్ భాస్కర్‌పై ఉన్న నమ్మకంతో చెబుతున్నా.. 'కీడా కోలా' మజా ఇస్తుంది. తర్వాత మా ఇద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుంది'' అన్నారు. సీనియర్ నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ–''డైరెక్టర్ జంధ్యాలగారి సినిమాలు చేస్తున్నప్పుడు వినోదం ఎంత హాయిగా పండిందో మళ్లీ 'కీడా కోలా'కి అలాంటి అనుభూతి కలిగింది'' అన్నారు. ''నా 'పెళ్ళి చూపులు, ఈ నగరానికి ఏమైంది' చిత్రాల విడుదలప్పుడు చిన్న భయం ఉండేది. ప్రేక్షకుల స్పందన తెలుసుకునేందుకు థియేటర్ బయటే తిరిగేవాడిని. 'కీడా కోలా' విషయంలో ఆ భయం లేదు'' అన్నారు తరుణ్ భాస్కర్. ''రెండు గంటల పాటు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు'' అన్నారు నిర్మాతలు సాయికృష్ణ గద్వాల్, శ్రీపాద్.

ప్రేక్షకులకు పది రెట్ల థ్రిల్ గ్యారంటీ - అనిల్ విశ్వనాథ్



''మా ఊరి పొలిమేర' తొలి భాగం ఓటీటీలో రిలీజ్ కావడంతో ప్రేక్షకుల స్పందన పెద్దగా తెలియలేదు. సినిమా చూసి, చాలామంది బాగుందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. శుభలేఖ సుధాకర్‌గారు ఫోన్ చేసి, 'దర్శకుడిగా నీకు మంచి భవిష్యత్ ఉంటుంది' అని చెప్పడంతో నాపై నాకు మరింత నమ్మకం పెరిగింది'' అని డైరెక్టర్ డా. అనిల్ విశ్వనాథ్ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల, బాలాదిత్య, రాకేందు మౌళి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర–2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 3న రిలీజవుతోంది. ఈ సందర్భంగా అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర' ఎక్కడ ముగిసిందో అక్కడి నుంచే రెండో భాగం మొదలవుతుంది. తొలి భాగం హిట్టవ్వడంతో సీక్వెల్‌పై అంచనాలు పెరిగాయి. అందుకే పార్ట్ 2 స్క్రీన్‌ప్లేను మరింత బలంగా తయారు చేశాను. తొలి భాగంతో పోల్చితే ప్రేక్షకులు దాదాపు పది రెట్ల థ్రిల్ ఫీలవుతారు. వంశీ నందిపాటిగారి సహకారంతో మా చిత్రాన్ని ఘనంగా రిలీజ్ చేస్తున్నాం. 'బన్నీ' వాసుగారికి నచ్చడంతో మా సినిమా పెద్ద రేంజ్‌కు వెళ్లింది. 'మా ఊరి పొలిమేర 3' కూడా ఉంటుంది. అంతకన్నా ముందు వేరే జానర్‌లో ఓ సినిమా చేస్తా'' అన్నారు.

ప్రేమకథ షురూ



● నాగచైతన్య, అలేఖ్య హారిక, సంతోష్ శోభన్

సంతోష్ శోభన్, అలేఖ్య హారిక జంటగా కొత్త సినిమా షురూ అయింది. సుమన్ పాతూరి దర్శకత్వంలో అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్‌పై ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి డైరెక్టర్ చందూ మొండేటి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో నాగచైతన్య క్లాప్ కొట్టగా, డైరెక్టర్ వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహించారు. డైరెక్టర్ హరీశ్ శంకర్, నిర్మాత రవిశంకర్ యూనిట్‌కి స్క్రిప్ట్ అందించగా, హీరో సుశాంత్, దర్శకులు హను రాఘవపూడి, రాహుల్ సంకృత్యాన్ యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో మంచి ప్రేమకథ ఉంటుంది'' అన్నారు. ''నా మనసుకు దగ్గరైన కథ ఇది. నేను, ఎస్‌కేఎన్, సందీప్ రాజ్, అలేఖ్య.. మేమంతా ఫ్రెండ్స్. ఈ సినిమా వారితో కలిసి చేస్తుండటంతో మరింత బాధ్యతగా భావిస్తున్నా'' అన్నారు సాయి రాజేశ్. ''ఈ సినిమాకు దర్శకత్వం వహించే చాన్స్ ఇచ్చిన నా ఫ్రెండ్ సాయి రాజేశ్‌కు థ్యాంక్స్'' అన్నారు సుమన్ పాతూరి. ''హీరోయిన్‌గా చేయాలనే నా కల ఈ చిత్రంతో నెరవేరుతోంది'' అన్నారు అలేఖ్య హారిక. ''తెలుగు అమ్మాయిలను ప్రోత్సహించాలనే నా సినిమాల్లో తెలుగు అమ్మాయిలనే హీరోయిన్‌గా తీసుకుంటున్నాను'' అన్నారు ఎస్‌కేఎన్. ఈ చిత్రానికి కెమెరా: అస్కర్, సంగీతం: విజయ్ బుల్గానిన్, సహనిర్మాతలు: ధీరజ్ మొగిలినేని, రమేశ్ పెద్దింటి.

కథని నమ్మి చేశాం - శ్రీరామ్



● అవసరాల, ఖుషీ, శ్రీరామ్, సాయికిరణ్, కోన వెంకట్

''పిండం అనేది జననానికి, మరణానికి సంబంధించినది. ఈ 'పిండం' సాయి కిరణ్ లాంటి ప్రతిభగల దర్శకుడి పుట్టుకకు (ఇండస్ట్రీలో) కారణం కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు రచయిత, నిర్మాత కోన వెంకట్. సాయికిరణ్ దైదా దర్శకత్వంలో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' ఉపశీర్షిక. కళాహి మీడియాపై యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్నారు కోన వెంకట్. మరో అతిథి బీవీఎస్ రవి (రచయిత, దర్శకుడు) మాట్లాడుతూ– ''ఈ సినిమా టీజర్, నిర్మాణ విలువలు బాగున్నాయి. తప్పకుండా విజయం సాధిస్తుంది'' అన్నారు. శ్రీరామ్ మాట్లాడుతూ– ''కథని నమ్ముకొని చేసిన చిత్రం 'పిండం'. ఈ సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో నటించిన ఇద్దరు పిల్లల నటన చూసి నేనే ఆశ్చర్యపోయాను. ఇలాంటి మంచి సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''కళాహి మీడియా బ్యానర్‌పై 'పిండం'లాంటి మంచి సినిమాలు మరిన్ని చేస్తాం'' అన్నారు యశ్వంత్ దగ్గుమాటి. ''ఇదొక ఇంటెన్స్ హారర్ ఫిల్మ్'' అన్నారు సాయి కిరణ్ దైదా. సంగీత దర్శకుడు కృష్ణ సౌరభ్ సూరంపల్లి, కెమెరామేన్ సతీష్ మనోహర్ తదితరులు మాట్లాడారు.

ఒకేసారి ఐదు సినిమాలు ఒక సంచలనం - బ్రహ్మానందం



● అచ్యుతరావు, బ్రహ్మానందం, ఉపేంద్ర

''ఒక సినిమా తీయడానికే ఇబ్బంది పడుతున్న ఈ రోజుల్లో ఒకేసారి ఐదు సినిమాలు తీస్తుండటం ఓ సంచలనం. తన కుమారుడు ఉపేంద్రని హీరోగా పరిచయం చేయడంతో పాటు ఒకేసారి అతనితో ఐదు సినిమాలు తీస్తున్న అచ్యుతరావుకి అభినందనలు. దీనివల్ల పరిశ్రమను నమ్ముకున్నవారికి అవకాశాలు ఇచ్చి, భోజనం పెట్టినట్లవుతుంది. 'ఉపేంద్రగాడి అడ్డా' మంచి హిట్టవ్వాలి'' అని సీనియర్ నటుడు బ్రహ్మానందం అన్నారు. కంచర్ల ఉపేంద్ర, సావిత్రీ కృష్ణ జంటగా ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వం వహించిన చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్‌పై కంచర్ల అచ్యుతరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరై, 'ఉపేంద్రగాడి అడ్డా' ట్రైలర్‌ను, '1920 భీమునిపట్నం' పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే ఉపేంద్ర హీరోగా ఇదే బ్యానర్‌లో తీస్తున్న ఐదు సినిమాల టీజర్లను విడుదల చేశారు. కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో నవంబర్ నుంచి ప్రతీ నెల ఒక సినిమాను విడుదల చేయబోతున్నాం'' అన్నారు. ''నా పుట్టిన రోజుకి ఇది వెలకట్టలేని పెద్ద బహుమతి'' అన్నారు కంచర్ల ఉపేంద్ర. ''సోషల్ మీడియా నేటి సమాజాన్ని ఎంతగా ప్రభావితం చేస్తోందో మా చిత్రం ద్వారా చూపిస్తున్నాం'' అన్నారు ఆర్యన్ సుభాన్ ఎస్‌కే. హీరోయిన్ సావిత్రీ కృష్ణ, సహనిర్మాతలు కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత పాల్గొన్నారు.

అంబాజీపేట సంతృప్తి ఇచ్చింది - సుహాస్



● సుహాస్, శివానీ నాగరం

''అంబాజీపేట మ్యారేజి బ్యాండు' ఫ్రెష్ సబ్జెక్ట్. సినిమా కొత్తగా ఉంటుంది. నటుడిగా నాకు సంతృప్తినిచ్చింది. ఒక మంచి సినిమా చూశామనే అనుభూతితో ప్రేక్షకులు థియేటర్స్ నుంచి బయటకు వస్తారు'' అని సుహాస్ అన్నారు. దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో సుహాస్, శివానీ నాగరం జంటగా నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. జీఏ2 పిక్చర్స్, మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ నిర్మించాయి. ఈ చిత్ర సంగీతదర్శకుడు శేఖర్ చంద్ర స్వరపరచిన 'గుమ్మా....' అంటూ సాగే తొలి పాటను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దుశ్యంత్ కటికినేని మాట్లాడుతూ– ''ఈ పాటకి రెహ్మాన్ మంచి లిరిక్స్ ఇచ్చారు. ఈ సినిమాలోని పాటలన్నీ బాగుంటాయి'' అన్నారు. ''జనవరి నెలాఖరులో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు ధీరజ్ మొగిలినేని. ''మంచి సినిమాలు ఎప్పుడొచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తారు. 'అంబాజీపేట..' హిట్ కావాలి'' అన్నారు నిర్మాత ఎస్‌కేఎన్. నటులు జగదీశ్, నితిన్, డ్యాన్స్ మాస్టర్ మోయిన్ తదితరులు మాట్లాడారు.